

ప్రజలందరి నోట సాయినామం పలకాలి!
సర్వత్రా సాయిరూపంరంజిల్లాలి!
ముజ్జగాలు సాయిమహిమతో ముప్పిరిగొనాలి!
సాయిపద రవళులు మన హృదయకుహరంలోని నిశ్శబ్దనిశీథిలో
ప్రతిధ్వనించాలి! ప్రణవనాద వీచికల్లా సాయిజ్ఞానసౌరభాలు సర్వత్రా
వ్యాపించాలి. ఆ సుజ్ఞానసౌరభాల ఆస్వాదనలో
మన మనసులు మత్తెక్కాలి!
సాయి ప్రేమామృతధారలు అంతటా నిరంతరం వర్షించాలి!
ఆ ప్రేమామృతధారలలో తడుస్తూ, ఆ జ్ఞానసౌరభాల మత్తులో
ఆనందంగా నర్తిస్తూ 'సాయివంటిదైవంబు లేడోయి! లేడోయి!అని
అందరూ ఏక కంఠంతో గానం చేయాలి!
అదే నా ఆశ, ఆశయం, ఆకాంక్ష! అదొక మధురస్వప్నం.
ఆ స్వప్నసాఫల్యం కోసం శ్రీసాయినాధుని అనన్యప్రేమతో ఆర్ధ్రతతో
ప్రార్థించటమే మనం చేయగలిగింది, చేయవలసింది.

-- శ్రీ బాబూజీ

## ఈ సంచికలో


| | | | |
|---|---|---|---|
| 1. | సాయివంటి దైవంబు లేడోయి! లేడోయి!! | శ్రీ బాబూజీ | --- 2 |
| 2. | ఉన్నమాట - అనుకున్న మాట | గురుబంధువులు | --- 3 |
| 3. | అనుక్షణం - అనుగ్రహం | గురుబంధువు | --- 5 |
| 4. | కలకాదు నిజమే! వరప్రదాయి గురూజీయే | వి. సుజిత | --- 7 |
| 5. | "గురుకృప" అందితే ఫష్టుక్లాసే | శ్రీదేవి | --- 8 |
| 6. | అవసరం - అభయం - ఆనందం | హనుమంతరావు | --- 9 |
| 7. | చెత్తనూడ్పించారు - అనుగ్రహించారు | కిషోర్ | --- 10 |
| 8. | వీడినవారికి, వేడినవారికి అభయమే | సుభాషిణి | --- 12 |
| 9. | అజ్ఞాతంగా కూడా అనుగ్రహమే | జి. సుబ్రహ్మణ్యం | --- 13 |
| 10. | సమస్యల కొలువుకు పరిష్కారాల నెలవు 'సత్సంగం' | సుశీల | --- 13 |
| 11. | ఆచేయి ఎంత హాయి | డా॥ ఎస్. సాయివరప్రసాదరావు | --- 14 |
| 12. | మహనీయులలోని ఉదారగుణం - మనిషిని సంస్కరించు దివ్యతేజం | గురుచరణదాసుడు | --- 18 |





**శ్రీ సచ్చిదానంద సద్గురు సాయినాథ్ మహారాజ్‌కీ జై!**

**సద్గురు శ్రీ సాయినాథుని శరద్బాబూజీకీ జై!**

# గురుకృప

సంపుటి 6 | సంచిక 2 | త్రైమాసిక పత్రిక | ఏప్రియల్ 2003

**నిర్వహణ**
గురూజీ
ఆశీస్సులతో
గురుబంధువులు

**చిరునామా**
గురుకృప
22-1-50
గాంధీచౌక్
తెనాలి - 01

08644
227194 (O)
231808 (R)

## ఉన్నమాట - అనుకున్నమాట

"బ్రహ్మా, విష్ణుశ్చ, రుద్రశ్చ, దేవాశ్చ, పితృ, కిన్నరా!
సిద్ధ, చారణ, యక్షాశ్చ, అన్యేచ మునయోజనాః"! ॥గురుగీత॥

త్రిమూర్తులు, సమస్త దేవతా సముదాయము, యక్షులు, కిన్నెరులు, సిద్ధులు, పితృదేవతలు, చారణులు వీరుకాక ఇతరులు అంతాకలిసి ఆశీర్వదించినను, వారి ఆశీర్వాదములు ఎన్ని ఉన్నను **"గురుకృప"** లేని నాడది నిష్ప్రయోజనము.

ఒక పాచకుడొకసారి మంచి భోజనమును తయారు చేసికొనదలచి కావలసిన సరంజామా నంతటిని సంసిద్ధము చేసికొనినాడు. చక్కగా తగిన మోతాదులలో దినుసులనుపయోగించి కూరలను పచనము గావించాడు. మధురమైన పాయసాన్ని గూడా తయారుచేసికొని భోజనానికి ఉపక్రమించాడు. తాను తయారుచేసికొనిన వార్తాకశాకమును తినాలని ఉత్సుకత చూపించిన కొద్దిసేపటికే ఊసేసాడు. తనకూరలోని లోపమేమిటో తెలుసుకొని ఉప్పును వేసి భోజనం చేసాడు. రసనానికి రుచి అందిం-తరువాత అప్పడనుకున్నాడు. ఔరా! అన్ని దినుసులను నేను సక్రమంగా ఉపయోగించితినే. ఒక్క ఉప్పును మర్చిపోయినంతమాత్రాన రుచిలేకుండా పోయిందేనని గ్రహించి. ఉప్పవేయడం వలన ఎంత రుచి, ఏమి రుచి, కూరలో ఉప్ప తప్ప మిగిలినవి తగ్గినంత మాత్రాన రుచికి లోపముండదే, నష్టమంతగా కన్పించదే. ఉప్ప విషయంలో అలాకాదనుకొనినాడు. మన ఆధ్యాత్మికతనే వంటకానికి **గురువు** కూడా ఉప్ప వంటి వాడేనని తెలుసుకోవాలి. **గురుకృప** వినా సమస్తం లోపభూయిష్టం. **ఆధ్యాత్మికతలో అడుగు ముందుకు వేయాలంటే గురువు అవసరమేమరి.**

ప్రభుత్వం ముద్రించే కరెన్సీనోటుకు విలువ పెరిగేది గవర్నరు సంతకము



పెట్టిన మీదట. నీ సాధనా సంపత్తియను కరెన్సీనోటుకు గవర్నరు సంతకము వంటి దన్న మాట **"గురుకృప". సద్గురు దీవెనే లేకుంటే ఆధ్యాత్మిక మధురానుభూతిని పొందలేవు.**

ఎన్నో వేలాది సత్సంగాలు చేసినట్లుగా లెక్కలు చెప్పి పదిమందిలో పెద్దల ముందు చప్పట్లు చరిపించుకోవచ్చు. కొందరి అండదండలు వారికి ఉండవచ్చు. ఇక్కడ చప్పట్లు చరిచిన వారంతా వారివారి వీరాభిమానులయివుండటం విశేషం. గుర్తుంచుకో! అనేక గ్రంధాలు చదివి ఉండవచ్చు. సత్సంగ కేంద్రాలు స్థాపించియుండవచ్చు. వేలాది రూపాయలను వెచ్చించి భజనాదులు సాగించవచ్చు. గ్రామ, గ్రామేతర ప్రాంతాలలో సత్సంగాలు చేసి ఉండవచ్చు. అది సొంతానికి సాధించామా? సొంత బలాలను పెంచుకొనినామా! అని యోచించాలి. జాగ్రత్తగా యోచించినచో పైనుదుహరించిన ఉప్పులేని కూరవంటి సత్సంగాల వలన ప్రయోజనమేమిటి? గవర్నరు సంతకముగల కరెన్సీ నోటువంటి సత్సంగాలు మనకు కావాలి. **సత్సంగంవలన వివేకత ఉద్భవిస్తుంది, ఆలోచన పెరుగుతుంది.** వాస్తవమేమిటో తెలుసుకొనే వీలుంటుంది. అంధవిశ్వాసాల పట్ల విముఖత పెరుగుతుంది. మూఢనమ్మకాల మీద విసుగుజనిస్తుంది. సత్యాసత్య యోచన పెరుగుతుంది. ముఖ్యంగా వ్యక్తి ఆరాధన నశిస్తుంది. వ్యత్యాసాలు తేలికగా అవగతమయ్యే స్థితి కలుగుతుంది. జ్ఞాన సముపార్జనకు అర్హత లభిస్తుంది. అది లభించినవానికి **"గురువు", "గురుకృప" యొక్క ఆవశ్యకత ఏమిటో అర్థ మౌతుంది.** గురువును గూర్చి చెప్పటమంటే, గురుగౌరవానికి, గురువుయొక్క ఆదర్శానికి మనం అడ్డుగోడగా నిలవరాదు.

"గురుం త్వం కృత్య హుంకృత్య గురుసాన్నిధ్య భాషణ

అరణ్యే నిర్జలే దేశే సంభవేద్బ్రహ్మ రాక్షస ॥శ్రీగురుగీత॥

గురుదేవుల అగౌరవానికి కారకుడవైనను, గురువునకు కోపము కల్గించిన వాడివైనను, జన జీవనములేని అడవియందు బ్రహ్మరాక్షసుడవై పుట్టెదవని భావము.

గురువు యొక్క గొప్పతనము మనకు మొదట తెలియాలి. నిర్మల, శాంత, సాధుస్వభావ చిత్తమున్న వారు, పరిమితముగా మాట్లాడువారు, అరిషడ్వర్గాదుల నుండి విడివడినవారు, ఇంద్రియ జయము గలవారు, సదాచార సంపన్నులైనవారు - గురువులు. సూచకాది ఆధారము చేసికొనిన శిష్యుడు (సాధకుడే సుమా) తత్త్వనిష్ఠునికి మాత్రమే శరణాగతి పొందును.

అక్షరాభ్యాస ఆరంభకాలము నుంచి, ఆత్మభిన్నమైన లౌకిక శాస్త్రాదులను చక్కగా ఎవనివద్ద అధ్యయనము చేయబడినదో అట్టి గురువును - **సూచకగురువని** అందురు. వర్ణాశ్రమ ధర్మాలకు తగిన ధర్మాధర్మాదులను ఏ గురువు శిష్యునకు తెలియజేయునో అట్టి గురువును **వాచకుడని** అందురు.

'సంపాదన', వశీకరణము, మారణము మొదలగు తుచ్ఛమంత్రములనుపదేశించు గురువు "నిషిద్ధుడని" శిష్యుడు గుర్తించాలి. (సంపద పెంచుటకు ఆధ్యాత్మిక మోసము చేయువారిని ఈ కోవలోనే గుర్తించి జాగ్రత్తపడాలి).







మిధ్యా జగత్తును నిరూపించి, వైరాగ్య భావనను పెంచి, సుఖదుఃఖాది సంకటముల నుండి తప్పించు గురువు **విహితగురువు**. మహా వాక్యముల భావదీప్తిని విశదీకరించి, భవబంధాలను నివారించు గురువు **కారణగురువు**. సమస్త సందేహములను నివృత్తిగావించి, జన్మమృత్యుభయాదుల నుండి దూరముచేయగల సమర్ధ గురువును **పరమగురువని** తలంచుము. శాఖోపశాఖలుగా విస్తరించి ప్రపంచమనే ఆ తపములనుండి రక్షించి, చల్లని నీడనిచ్చు **"గురుదేవుని"**, **"గురుకృపను"** మనమెలా అర్ధం చేసుకొంటున్నామో! ఒంటరిగా బాబా ముందు కూర్చుని ఏంచేస్తున్నామో! ఎలా ప్రవర్తిస్తున్నామో! యోచించుకోవాల్సిన సమయమాసన్నమైనదనుకుంటాను. ఈ నూతన తెలుగుసంవత్సర శుభా కాంక్షలను, **"గురుకృప"** గురుకృప పాఠకులకు అందిస్తున్నది.

నమస్కారములతో
గురుబంధువులు

## అనుక్షణం - అనుగ్రహం

నేను ఎందర్నో కాపాడటానికి వేల (మైళ్లు) క్రోసులు వెళ్ళాలి - అన్న బాబా వాక్కును మనకు శృతి వాక్యంగా తెలిపి, ఈ మసీదు తల్లి ఒడిని చేరిన వారికి కష్టాలన్నీ తొలిగిపోతాయన్న అభయాన్ని మనం ఎప్పుడూ ఎఱుకలోనికి తెచ్చుకొనేట్లు చేస్తున్న పూజ్యగురుదేవులు శ్రీ సాయినాధుని శరత్‌బాబూజీ గారి పాదపద్మములకు ప్రణమిల్లుతూ *"What is truly needed will be fulfilled"* అన్న గురుశృతి, నా జీవితంలో కలిగిన కొన్ని కీలక ఇబ్బంది సమయాలలో అనుభవమై, చివరకు వారి **"అనుక్షణం - అనుగ్రహం"** అన్న కరుణావిలాసము అవగతమైంది. ఏమని వర్ణింతును మాపై వారి కరుణను, వారు మాకు ప్రసాదించిన లీలామృతాలను తద్వారా మా ఆనందాన్ని... గురుకృప ద్వారా మీతో పంచుకొనే ప్రయత్నం ....

2001 వ సంవత్సరంలో నేను అమెరికాలోని ఒక టెలికమ్యూనికేషన్ కంపెనీలో కంప్యూటర్ ప్రోగ్రామర్ గా పనిచేస్తున్నప్పుడు, కంపెనీ యెక్క ఆర్ధిక పరిస్థితులవల్ల నా ప్రాజెక్ట్ జూలై 31, 2001 అయి పోయినట్లు తెలిసింది. ఆ సమయంలో నా భార్య 5వ నెల గర్భవతిగా ఉన్నది అటువంటి సమయంలో నా ఉద్యోగం పోవడం ఎంతో మనోవేదనకు గురిచేసింది. ఆ పరిస్థితులలో నాకు మళ్లీ ఉద్యోగం ఎన్ని రోజుల్లో వస్తుందో, అసలు వస్తుందో రాదో కూడా తెలియదు.

ఆగష్టు 2వ తారీఖు - గురువారం బాబాసత్సంగానికి వెళ్ళాము. అక్కడ సత్సంగంలో ఆర్తితో బాబాను, గురువుగారిని ప్రార్ధిస్తూ, సాయిబాబా పాటను పాడటం జరిగింది. సత్సంగం తరువాత గురుబంధువు జనార్ధన్ గారు మాట్లాడుతూ - సాయిబాబా, గురువుగార్ల ఆశీస్సులతో ఒకవారం లోపలే నీకు మరలా ఉద్యోగం తప్పక వస్తుందని, గురువుగారి పటం క్రింద వ్రాయమని చెప్పారు. ఇంటికి వచ్చి గురువుగారి పటం క్రింద "ఒక వారం లోపల మళ్లీ ఉద్యోగం రావాలి" అని వ్రాయడం జరిగింది. ఆగష్టు 6వ తారీఖున (సోమవారం) నా ఉద్యోగ సహచారిణి ఎర్లిండా హీచ్‌నేర్‌తో ఇంటర్ నెట్‌లో మాట్లాడుతూ ఉండగా, ఆమె యెక్క స్నేహితురాలు అదే టెలికమ్యూనికేషన్ కంపెనీలో మేనేజరుగా పనిచేస్తుందని, వాళ్ళ టీమ్‌లో ఒక ప్రోగ్రామర్ అవసరం ఉందని, నీకు అభ్యంతరం లేకుంటే నీ





రెజ్యూమ్ ఆమెకు పంపమని చెప్పింది. బాబా, గురువు గార్లపై భారం ఉంచి ఆమెకు నా రెజ్యూమ్ పంపడం జరిగింది. బాబా, గురువు గార్లు ఆమె రూపంలో నాకు సహాయం చేస్తున్నట్లు తర్వాత గాని నాకు అర్థం కాలేదు.

ఆగష్టు 7వ తారీఖున (మంగళవారం) - ఎర్లిండా ఉదయం 6 గంటలకు ఫోన్ చేసి తన స్నేహితురాలు, మేనేజరు అయిన లీసా స్కోటోతో ఉదయం 9గంటలకు నాకు ఇంటర్వ్యూ ఉన్నట్లు తెలిపింది. నేను ఆమె చెప్పిన విధంగానే ఆ రోజు ఇంటర్వ్యూకు అటెండ్ అయ్యాను. ఆ పరిస్థితులలో కంపెనీలో హైరింగ్ ఫ్రీజ్ ఉన్నప్పటికీ బాబా, గురువుగార్ల ఆశీస్సుల ఫలితంగా కంపెని వైస్ ప్రెసిడెంట్ నుండి ఆ పొజిషన్‌కు అప్రూవల్ లభించింది.

ఈ విధంగా సద్గురు కటాక్షవీక్షణాల ఫలితంగా కంపెనీలో ఆర్థిక పరిస్థితులు బాగాలేకపోయినా, హైరింగ్ ఫ్రీజ్ ఉన్నప్పటికి మళ్ళీ ఒక వారం లోపలే నాకు ఉద్యోగం లభించింది. తల్లిలా ప్రేమించి, మనలను ఎల్లప్పుడు రక్షించే సాయిబాబా, గురువుగార్లకు ఏమి ఇచ్చి వారి ఋణం తీర్చుకోగలము. వారు నాకు ప్రసాదించిన ఈ లీలామృతాలను మీతో పంచుకోవడం తప్ప.

నా భార్య నీలిమ 5వ నెల గర్భిణీగా ఉన్నపుడు, మంత్లీ చెకప్ కోసం డాక్టర్ పమేల్లా రిచర్డ్స్ వద్దకు వెళ్ళడం జరిగింది. అప్పడు డాక్టర్ ఎ.టి.పి. టెస్ట్ చేయించుకోమని కోలరాడో స్ప్రింగ్స్ లోని మెమోరియల్ హాస్పిటల్‌కు వెళ్ళమని సలహా ఇచ్చారు. వారి సలహా మేరకు జూలై 7వ తారీఖున లేబ్‌కు వెళ్ళి బ్లెడ్ సేంపిల్స్ ఇచ్చిరావడం జరిగింది.

ఆ తరువాత వారంలో, డాక్టర్ పమేల్లా ఆఫీసు వారు ఫోను చేసి ఆ పరీక్ష ఫలితాలు అనుకూలంగా లేవని, ఫలితాల ప్రకారం హైరిస్క్ ప్రెగ్నెన్సీ అవుతుందని, బిడ్డ యొక్క ఆరోగ్య పరిస్థితి స్కాన్ చేసిన తర్వాత గాని తెలియదని చెప్పడం జరిగింది.

ఆ వార్తతో మాలో ఎన్నో బాధలు చోటుచేసుకొన్నాయి. రాత్రంతా సాయిబాబా, గురువుగార్ల ముందు (పటాల ముందు) ఎంతోసేపు బాధ పడ్డాం. ఆ క్షణంలో బాబా, గురువుగార్లు ఇచ్చిన అభయాలను మాయ అనే వలలో మరిచాం. ఎఱుక, మఱుపుల హేల వారి దివ్య లీలా అన్నట్లు.....

జూలై 19వ తారీఖున, గురువారం బాబా, గురువుగార్ల పై భారం ఉంచి స్కానింగ్‌కు వెళ్ళడం జరిగింది. స్కానింగ్ థియేటర్‌లో మొదట బేబిని స్కాన్ చేయడం జరిగింది. బేబి మూమెంట్స్ అన్ని చక్కగా ఉన్నాయని, మెజర్‌మెంట్స్ అన్ని కరెక్టుగా ఉన్నాయని, కానీ టెస్ట్‌రిజల్ట్స్ ఎందుకు అనుకూలంగా లేవో వారికి అర్థం కాలేదని ఆశ్చర్యం వెలిబుచ్చారు.

ఇంతలో ఏదోశక్తి (సద్గురుశక్తి) వారిలో ఆలోచన మెరిపించినట్లు వారు అన్ని వివరాలు మరలా పరిశీలించడం జరిగింది. ఆ పరిశీలనలో వారు మొదట చేసిన కాలుక్యులేషన్ తప్పని, మరలా సరి అయిన తేదీలతో గ్రాఫ్ రీప్లాట్ చేయడం జరిగింది. ఈ సారి ఎ.టి.పి. లెవల్ సరిగా ఉన్నదని, బిడ్డకు ఏ మాత్రం ప్రమాదం ఉండదని చెప్పి, మగబిడ్డ అని కూడా చెప్పారు. మా బాబుకు "సాయిశరత్" అని నామకరణం చేసాము.

అనుక్షణం మమ్మల్ని కాపాడుతూ, మా తప్పల్ని మన్నిస్తూ, మమ్మల్ని సాయిపథంలో నడిపిస్తూ, మాపై అనన్య ప్రేమను చూపించుతున్న గురూజీ పాదపద్మములకు నమస్కరిస్తూ...

మీ గురుబంధువు





# కలకాదు నిజమే! వరప్రదాయి గురూజీయే

నాపేరు వి. సుజిత. నేను 4వ తరగతి చదువుతున్నాను. నేను మా అమ్మతో షిర్డి వెళ్ళాను. ఒకరోజు మేము బాబాదర్శనానికి వెళ్తున్నప్పుడు గులాబీ బంచ్ కన్పించినది అందులో యల్లో ఫ్లవర్ వుంది. అది బాబా దగ్గరకి తీసుకెళ్ళాలని అనుకున్నాను. కాని అది వాడిపోయినదని అమ్మ వద్దంది. సమాధి దగ్గర బాబాని పిలిస్తే, బాబా పలుకుతారని మమ్మీ చెప్పింది. బాబా పాదాలకు నమస్కారం చేసుకుంటూ **"బాబా"** అని పిలిచాను. బాబా **"ఓయ్"** అని పలికారు. (ఇది నా మొదటి అనుభవము). ఈ విషయం చెబితే అమ్మ నమ్మలేదు. నేను వెళ్ళిపోతుంటే అక్కడున్న పూజారి నన్ను పిలిచి, యల్లో గులాబి ఉన్న ఒక ఫ్లవర్ బంచ్ ఇచ్చారు. నేను చాలా హేపీ ఫీల్ అయ్యాను. అప్పుడు నేను, బాబా పలికారంటే నువ్వు నమ్మలేదు. నాకు నచ్చిన యల్లో ఫ్లవర్ బంచ్ ఇచ్చారు. ఇప్పటికైనా నువ్వు నమ్ముతావా, అని అన్నాను. అప్పుడు అమ్మ ఔను నిజమే అంది.

ఒక రోజు సత్సంగం హోలులో గురువుగారు స్టేజ్ మీద దర్శనం ఇచ్చి వెళ్ళిపోతుంటే. నేను కొంచెం ముందుకు వెళ్ళి గురువుగార్కి నమస్కారం చేసుకున్నాను. అప్పడు గురువుగారు నావైపు చూసి నవ్వారు, అప్పడు నాకు చాలా సంతోషం కలిగింది. గురువుగారి నవ్వు చాలా బావుంది.

నారాయణి ఆంటీ, కృష్ణవేణి ఆంటీ పిల్లల గురించి చాలా బాధపడ్తున్నారు. నాకు వాళ్ళని చూస్తే చాలా బాధన్పించింది. గురువుగారి దర్శనానికి వెళ్ళినపుడు వాళ్ళిద్దరికి పిల్లల్ని ఇమ్మని అడుగుదామని అనుకున్నాను. కాని గురువుగారి దగ్గరకి వెళ్ళాక నాకు ఫస్ట్ క్లాస్ రావాలని అడిగాను కాని, ఆంటి వాళ్ళ విషయం చెప్పడానికి మాత్రం నాకు భయం వేసింది. గురువుగారిచ్చిన ఊది తీసుకుని బైటికి వచ్చేశాను. ఆ తర్వాత ఇంటికి వచ్చిన 3 రోజులకి నాకొక కల వచ్చింది. ఆ కలలో గురువుగారు కన్పించలేదు కాని, అమ్మగారు కన్పించారు. ఆ కల కూడా గురువుగారి దర్శనం అయిపోయాక బైటికి వస్తున్నప్పడు అనగా గురువుగారు కూర్చున్న గదిలోంచి మనం బైటికివచ్చే డోర్ దగ్గర్నుండి కల మొదలయ్యింది. గురువుగారితో కృష్ణవేణి ఆంటి, నారాయణి ఆంటిల గురించి చెప్పలేదని ఫీల్ అవుతూ బైటికి వస్తుండగా, అమ్మగారు ఇంట్లోనుండి బైటకి వస్తూ ముఖద్వారం దగ్గర కన్పించారు. నన్నుచూసి, "బన్నీ! నువ్వుగురువుగార్ని ఫస్ట్ ర్యాంక్ అడిగావు కదా, మరి నువ్వు ఎందుకు చదవడం లేదు అని అడిగారు. దీనికి నేనేమీ సమాధానం చెప్పకుండా ఒక నవ్వు నవ్వి, నారాయణి, కృష్ణవేణి ఆంటీలకు పిల్లలు కావాలి, ఈ విషయం గురువుగారితో చెప్పండి; అని చెప్పాను. దానికి అమ్మగారు, "సరే" అని ఇంట్లోకి వెళ్ళిపోయారు. లేచాక మమ్మీతో, నారాయణి, కృష్ణనేణి ఆంటీల గురించి గురువుగారితో చెప్పేసానమ్మా అని చెప్పాను.

తర్వాత 2 నెలలకి నారాయణి ఆంటి ప్రెగ్నెంట్ అని తెలిసింది. తర్వాత నారాయణి ఆంటి పాపే కావాలన్నారు. దాని గురించి కూడా గురువుగారితో చెప్పాను. ఆంటీకి నవంబర్ 2002 లో బుజ్జిపాప పుట్టింది. నాకు చాలా సంతోషం అన్పించింది. గురువుగారికి కృతజ్ఞతలు చెప్పకున్నాను. కృష్ణవేణి ఆంటికి ఇంకా గురువుగారు పాపని ఇవ్వలేదు, కాని త్వరలోనే ఇస్తారు.

నాకు గురువుగారంటే చాలా ఇష్టం. గురువుగారు మనందరి సమస్యలు తీరుస్తారు.

వి. సుజిత, ఉక్కునగరం, వైజాగ్



# “గురుకృప” అందితే ఫస్టుక్లాసే

నా పేరు శ్రీదేవి. మాది నెల్లూరు. నెల్లూరులోని బైపాస్ రోడ్‌లో ఉండే సత్సంగ మందిరానికి దగ్గర లోనే మా ఇల్లు. మేము గురువుగారిని 1993 నుంచి దర్శించుకొంటున్నాము. గురువుగారితో ఎన్నో అనుభవాలున్నా, నా మనసుకు నచ్చిన అనుభవాన్ని చెప్తాను.

నా డిగ్రీ ఫైనల్ పరీక్షలు జరగడానికి ముందు ఈ విధంగా జరిగింది. నాకు చదువు మీద పెద్ద ఇంట్రస్ట్ లేదు. పరీక్షలు ఒక నెల ఉన్నాయనగా నేను చదువడం ప్రారంభిస్తాను. నోట్స్ కూడా అప్పటికప్పుడు ప్రిపేర్ చేసుకుంటాను. ఆ విధంగానే ఫైనల్ ఇయర్ పరీక్షలు దగ్గరకి వచ్చాయి. నాకు ఎకనామిక్స్ పరీక్ష దగ్గరకి వచ్చింది. మిగిలినవన్నీ బాగానే రాసాను. ఎకనామిక్స్ అంటే నాకు కొంచెం భయం. ఎకనామిక్స్ పరీక్షకు 5 రోజులు సెలవిచ్చారు. ఆ టైమ్‌లో నేను పోర్షన్ పూర్తిచేయాలి. అంతకుముందు మా అక్క 18 ప్రశ్నలు ఇంపార్టెంట్‌వి పెట్టి ఇచ్చింది. నేను పరీక్ష మూమెంట్‌లో సరిగ్గా చదవలేకపోయాను. నాకు భయం వేసింది. నేను మాయింట్లో ఉండే గురువుగారి ఫోటో తీసుకొని నా పక్కన పెట్టుకొని, 18ప్రశ్నలకు 1 నుండి 18 వరకు చీటీలు వ్రాసి వేశాను. అందులో 5 చీటీలు తీశాను. ఆ ప్రశ్నలు మాత్రమే చదివాను. అవి కూడా సరిగ్గా చదవలేదు. పరీక్ష రోజు రానే వచ్చింది. మాకు ప్రశ్నలు ఏ విధంగా ఇస్తారంటే 3x20=60, 2x10=20, 5x4=20 మొత్తం 100 మార్కులకు ఇస్తారు. నేను చదివిన ఆప్రశ్నలలో రెండు మాత్రమే వచ్చాయి. ఒకటి 20 మార్క్సుది, రెండవది 10మార్క్సుది. అంటే మొత్తం 30మార్క్సు మాత్రమే నేను పరీక్షలలో వ్రాశాను, మిగిలినవి సొంతంగా వ్రాసాను. నేను ఇంటికి వచ్చి చాలా బాధ పడ్డాను - 5 ప్రశ్నలు రాలేదని, ఆ రోజు సాయంత్రందాకా మనసు ఆ విధంగానే ఉంది.

సాయంత్రం ఒక విచిత్రం జరిగింది. గురుకృప ఎడిషన్ వచ్చింది మాయింటికి. ఎందుకో దానిని తీసి అది కూడా చివరి పేజీ తీశాను. అందులో ఏమి రాసుందంటే, గురువుగారికి ఎవరో ప్రశ్న వేశారు. ఆయన దానికి సమాధానం ఇచ్చారు. అది ఏంటంటే.

గురువుగారిని “గ్రేస్ పొందాలంటే ఏం చెయ్యాలి?” అని అడిగారు. దానికి గురువుగారు - ఏదో చేస్తే పొందేది గ్రేస్ కాదు. గ్రేస్ అన్నది దానంతట అదే వస్తుంది అని చెప్పి, దానికి ఒక ఉదాహరణ చెప్పారు. ఒక పరీక్షలో మనము వ్రాసిన 50మార్కులకు 50 మార్కులు వస్తే గ్రేస్ కాదు, 30 మార్కులకు రాసి, 50 మార్కులు రావడం గ్రేస్ అవుతుందని చెప్పారు. నాకు ఈ సమాధానం చూసి చాలా సంతోషం కలిగింది. నాకు కొండంత ధైర్యం వచ్చింది. నాకు భయం పోయింది. రిజల్ట్స్ వచ్చాయి. నాకు ఫస్ట్ క్లాస్ వచ్చింది. గురువుగారి గ్రేస్ ఆ విధంగా నా మీద పడింది. ఇంకా ఆయన గ్రేస్‌ని పొందుతూనే ఉన్నాను. నాకు ఎకనామిక్స్‌లో 46 మార్కులు వచ్చాయి. ఈ అనుభవం మాత్రం నేను నాలైఫ్‌లో మర్చిపోలేనిది.

శ్రీదేవి, నెల్లూరు

ఇంటర్ నెట్ లో “గురుకృప” - Visit : www.guruji.org





# అవసరం - అభయం - ఆనందం

బాబా చరిత్రను అవలోకనం చేసుకుంటే, ఆచార్య జి.జి. నార్కేను, శ్యామా బాబాకు పరిచయం చేయబోతే "నాకు వీణ్ణి పరిచయం చేస్తున్నావా? నాకితడు 30 తరాల నుండీ తెలుసు" అంటూ తనదైన శైలిలో 'నార్కే' అనే పిచ్చుక కాలికి దారం కట్టి తను బాధ్యతను స్వీకరించారు. అంతేకాక నార్కే 'జీవితంలో స్థిరపడటం' గురించి, నార్కేను 'పూణే'లో స్థిరపరుస్తానని నిగూఢరీతిలో చాలా ముందుగా తెలియచేయటం చూస్తాం. (నా విషయంలో) 'అభయం సర్వభూతేభ్యః' అంటూ మనకభయమిచ్చి, అవసరమన్నది అడగక తీరుస్తున్న మన గురుదేవులు నాకిచ్చిన 'అభయం - తద్వారా ఆనందం'.

ప్రియమైన గురువుగారి పాదపద్మములకు నమస్కరించి గురుకృప పాఠకులకు నాకు కలిగిన అనుభవాన్ని తెలుపుకుంటున్నాను. నాపేరు హనుమంతరావు, మాది ఒంగోలు. నేను గత 6 సం॥ల నుండి గురువుగారిని దర్శించుకుంటున్నాను. అప్పటి నుండి నేను ఒంగోలులో జరిగే సత్సంగ కార్యక్రమాలకు వెళుతూ, తరచూ శిరిడి వచ్చి గురువుగారిని దర్శించుకుంటూ వారి ఆశీర్వచనంతో ఇంటర్ పూర్తి చేసుకుని ఎమ్.సెట్ పరీక్ష వ్రాసినాను. వెంటనే శిరిడీకి శ్రీరామనవమి సెలవులలో వచ్చి 20 రోజులు ఉన్నాను. నేను ఇక్కడ (శిరిడీలో) ఉండగానే రిజల్ట్స్ వచ్చాయి. రేంక్ 77,000 వచ్చింది. ఇంజనీరింగ్‌లో నేను చదువుదామన్న మెకానికల్ సీట్ వచ్చే అవకాశం లేదు. దర్శనానికి వెళ్ళినప్పడు గురువుగారితో చెప్పకున్నాను. తర్వాత నన్ను ఏమిచేయమంటారు అని అడిగాను. గురువుగారు **"చెపుతాను"** అని అన్నారు. గురుపౌర్ణమి దాకా ఖాళీగానే ఉన్నాను. 'గురుపౌర్ణమి'కి ఒక నెల ముందుగా వచ్చి నాకు అవకాశం ఉన్న పనులలో ఇన్‌వాల్వ్ అయిపోయినాను. గురు పౌర్ణమికి గురువుగారు శిరిడీ వచ్చినారు. నేను శిరిడీలో ఉండగానే నాకు కౌన్సిలింగ్‌కు సంబంధించిన విషయం గూర్చి డేటు వచ్చినట్లుగా మా ఇంటి వద్దనుండి ఫోన్ వచ్చింది. ఇంటికి వెళ్లడానికి గురువుగారి దర్శనానికి వెళ్ళి, గురువుగారిని మీ బ్లెస్సింగ్స్‌తో నాకు ఫ్రీ సీటు రావాలి అని అడిగినాను. గురువుగారు దీవించి **"వస్తుంది"** అని అన్నారు. నేను గుంటూరుకు కౌన్సిలింగ్‌కు వెళ్ళగా అందులో నాకు కావలసిన సీట్స్ 3 ఉన్నవి. అవికూడా నిజామాబాద్ జిల్లాలోనే ఉన్నవి. ఆ లిస్ట్‌లో బోధన్ కూడా ఉన్నది. కాలేజ్ సీనియారిటీని బట్టి నేను బోధన్‌ను సెలక్ట్ చేసుకుని ఒంగోలు వెళ్ళి ఈ విషయం ప్రిన్సిపాల్‌గారికి చెప్పగా, నేను ఊహించని విషయం, నాకు తెలియని విషయం, ఆ ఊరిలో గురువుగారి చేతుల మీదుగా బాబా విగ్రహ ప్రతిష్ఠ జరిగిన మందిరం, సత్సంగ కేంద్రము ఉన్నట్లు సార్ చెప్పగా విని ఆశ్చర్యపోవడం నావంతు అయ్యింది. కాని ఇంటిలోని వారికి అంతదూరం పంపడం ఇష్టంలేదు. మరల నన్ను 2వ కౌన్సిలింగ్‌కు వెళ్లమన్నారు. నేను ఇష్టపడలేదు. ప్రిన్సిపాల్‌సార్ చేత చెప్పించగా వారి మాటమీద కౌన్సిలింగ్‌కు వెళ్ళినాను. నాకు సంబంధించిన గ్రూపు (మెకానికల్) కు కౌన్సిలింగ్ జరుగలేదు. బోధన్‌లో 77 వేల ర్యాంకు వచ్చిన నాకు సీట్ ఇప్పించడమేగాక, సత్సంగాలకు, బాబా మందిరమునకు వెళ్ళే అవకాశాన్ని ఈ విధంగా గురువుగారు కల్పించినారు.

డాక్టర్‌గారి ద్వారా బోధన్‌లో మన గురుబంధువు సాయి శ్రీనివాస్‌గారు ఉన్నట్లు చెప్పగా, తర్వాత నాకు అన్ని వసతులు వారిద్వారా మంచిగా కూడినవి. ఈ సంగతులు విన్న తర్వాత మా ఇంటిలో వారికి కూడా అంతదూరం అయినా వెళ్ళమని, ఎందుకంటే మనకు తెలిసిన గురుబంధువు ఉండటం వలన వాళ్ళు తృప్తి చెందినారు. ఇలా గురువుగారి అనుగ్రహంతో బోధన్‌లో చదువుకుంటున్నాను. అన్నింటికంటే ముఖ్యమైన విషయం ఒంగోలు కంటే బోధన్ శిరిడీకి దగ్గర. **ఎంత దగ్గర అంటే నాకు శిరిడీ పిలిస్తే పలకేటంత దగ్గర.**

హనుమంతరావు, ఒంగోలు

## చెత్తనూడ్చించారు - అనుగ్రహించారు చిత్రంగా! విచిత్రంగా!

బాబా చరిత్రలో దాసగణుదంటూ ఒక విశిష్ఠ స్థానం. **జీవిత గమనంలో గమ్యం చేరటానికి ఒక్క సద్గురు అనుగ్రహవీక్షణం చాలంటూ 'రహమ్‌నజర్ కరో'** అంటూ కీర్తించిన గణూ, తనను మసీదును శుభ్రం చేసే చీపురుగా స్వీకరించి, తన హృదయమాలిన్యాన్ని దయతో క్షాళన చేసి తనను సత్య పథంలో నడపమని ప్రార్థించాడు. (సద్గురువు) గురుదేవులు తన బిడ్డను రక్షించడానికై బిడ్డ యొక్క స్థితికి తానే దిగివచ్చి, చేత చీపురు ధరించి నన్ను కాపాడిన వైనం నిజంగా విచిత్రం.

నా పేరు కిషోర్, ఒంగోలు వాసిని, ఫోటోస్టాట్ మరియు క్యాసెట్ రికార్డింగ్ కలిసి ఉన్న షాపు మాది. గత సంవత్సరం 10వ తరగతి పరీక్షలు దగ్గరకు వస్తున్న రోజుల్లో గురుదేవులు షిర్డిలో ఉన్నారని తెలుసుకొని వచ్చి కొంతకాలమున్నాను. గురుదేవులు షిర్డినుండి వెళ్లినా అవకాశముండటంతో ఇంకొంత కాలమున్నాను. ఖాళీగా ఉండటంతో ఆశ్రమంలోని వారిని ఏదైనా పని చెప్పమనడంతో, నా చేతికి ఒక చీపురునిచ్చారు. ఒక మోస్తరుగా అది మునిసిపాలిటి చీపురుగా ఉంది. పని చెప్పమంటే చీపురు ఇచ్చారేంటి - బాబా! అనుకుంటూ, మనమే అడిగినప్పుడు తప్పదు అనుకుంటూ, గురు దేవులతో 'కష్టం వచ్చి ఇక్కడికి వచ్చి పని అడిగితే మునిసిపాలిటీ వాడ్ని చేసారు కదా' అని వాపోయాను. మునిసిపాలిటీ జాబ్ ఇప్పించటానికి ముందుగా ట్రైనింగ్ ఏమోనని సంభాళించు కున్నాను. చిమ్మేటపుడు ఎవరైనా చూస్తారేమోనని బిడియంగా అనిపించేది. చివరకు గురుదేవులు నాలాంటి వాడ్ని 'శుభ్రం' చేస్తున్నతీరు గురుతెలిగి సమాధానపడి, ఉన్నన్ని రోజులు 'శుభ్రం' చేసే పనిని ఆనందంగా చేసుకొని వెనుతిరిగాను.

ఒంగోలులో మా షాపు ప్రక్కనే ఉన్న స్కూల్‌లో 10 వ తరగతి పరీక్షలకు 'కాపీ' లు అందించడం కోసం ఎవరో ఒకళ్ళు కొన్ని పేపర్లు కలిపి 'రిడక్షన్' చేయించి తీసుకెళుతుంటారు. అలా చిన్నవిగా చేసిన ఒక కాపీ మా దగ్గరుంచుకొని అడిగిన వాళ్ళకి ఆక్షణాన తీసి ఇస్తుంటాం. అలా మా వద్ద ఎప్పుడూ కొన్ని కాపీలు ఉంటాయి. ఈ పని గత 5 సం॥ల నుంచి జరుగుతోంది. ఒంగోలులో దిగి షాపుకి వెళ్ళగానే నాతో షాపులో కలిసి ఉంటున్న నా సహచరుడు ఒక విషయం చెప్పాడు. నేను



షిర్డిలో ఉన్నప్పడు ఎవరో మాపై కంప్లైంట్ ఇస్తే రెండు కార్లు, 4 జీపులు వేసుకొని మా షాపుదగ్గరకు పోలీసులు, అధికారులు వచ్చి ఆగారు. అంతకు ముందే ఒకళ్లకు కాపీలు తీసి ఇచ్చాము. వారు వెళ్లిన అర నిమషంలో ఆఫీసర్స్ రావడం జరిగింది. ఏంటో విషయం తెలీదు. వచ్చి గందరగోళం చేసి అతన్ని బయటకు రమ్మని వాళ్ళు లోపలికి వెళ్ళి చెత్త డబ్బా దగ్గర నుండి వేస్టుపేపర్స్ వరకు, అక్కడున్న పేపర్స్ మొత్తం వెతుకు తున్నారు. మా ఫ్రెండ్స్‌కి ఏమీ అర్థం కాక ఏంటి సార్ అంటే, నువ్వు ఉండు కాసేపాగితే తెలుస్తుంది విషయం అని అన్నారట, విషయం చెప్పకుండా. చుట్టుప్రక్కల షాపులవాళ్ళు అందరూ వచ్చి గుమిగూడారు. గందర గోళంగా ఉంది. 10 నిమిషాలకి వాళ్ళు బయటకు వచ్చి, నీ మీద కంప్లైంట్ ఇచ్చారు, ఆన్సర్స్ జిరాక్స్ తీసి అమ్ముతున్నావని. నీ టైం బాగుంది. ఒక్క పేపరు చిక్కినా, ఆఖరిక్షణం దాకా మేము వచ్చేముందు తీయించుకొని వెళ్ళిన వాళ్ళు చిక్కినా నీ షాపుని సీల్ చేసేవాళ్ళం. ఇంకోసారి ఇలాంటి కంప్లైంట్ వస్తే ఊరుకోము అని చెప్పి వెళ్ళిపోయారు. అప్పడు తెలిసింది మనవాడికి వాళ్ళు పరీక్షల అధికారులు అని. గుండెఝుల్లుమంది. నిన్నటివి, మొన్నటివి తీసిన ఒకపేపరు అయినా కంపల్సరిగా ఉండాలి. అని లోపలికి వెళ్ళి మళ్ళీ మొత్తం వెతికితే ఒక్కటి కూడా కనిపించలేదు, అందులో సందేహం లేదు. కానీ! వచ్చిన అధికారులకు కానీ, మావాడికి కానీ ఒక్క కాపీ కూడా దొరకలేదు. అక్కడ ఉండాల్సిన 'చెత్త' ఆ స్థానంలో లేకుండా చేసి నా 'జీవనోపాధి'కి ఎట్టి భంగము రాకుండా చేసారు. అప్పడు అర్థమయింది, షిర్డిలో చెత్తనూడ్పించింది, ఇక్కడ చెత్త లేకుండా చేయటం కోసమని.

ఇలా నన్ను విపత్కర పరిస్థితినుండి కాపాడిన గురుదేవులకు నమస్కరించుకుంటూ, ఆయన అందించే ఏ పనైనా ఆనందంగా స్వీకరించే శక్తిని నాకివ్వమని మనస్ఫూర్తిగా ప్రార్థిస్తూ....

కిషోర్, ఒంగోలు

*శిరిడీలో శ్రీసాయి సన్నిధి నిత్య సత్యం. ఆయన 'కృపారసం' ఇప్పటికీ కుండపోతగానే వర్షిస్తుంది. ఆయన లీలా ప్రబోధం నిరంతరం కొనసాగుతూనే ఉన్నది.*

*- సాయిభక్తి సాధన రహస్యం.*

మీ అనుభవాలు, పత్రికకు మీరిచ్చే సలహాలను సాదరంగా ఆహ్వానిస్తుంది "గురుకృప". మీ వ్యాసాలను, అనుభవాలను 30వ తేదీ జూన్, 2003 లోపు క్రింది చిరునామాకు పంపిన గురుపూర్ణిమ సంచికకు స్వీకరింపబడతాయి. తరువాత వచ్చే వాటిని విజయదశమి సంచికకు స్వీకరించబడతాయి.

'గురుకృప' - 22-1-50, జి.వి.కాంప్లెక్స్, గాంధీచౌక్, తెనాలి - 522 201

'గురుకృప'- సాయివరప్రాసాదం, సత్యనారాయణ వీధి, రామలింగేశ్వర పేట, తెనాలి - 522 201





# వీడినవారికి, వేడినవారికి అభయమే

'అల్లాహి మీ యాచే కర్మోఅలే త్యాంతే ఆ పుళ్యాలా జైసేఁ రేవిలేఁ తై సేజ్ రాహిలే పాహిజో' - 'పుణ్యకర్మ కొద్దీ భగవంతుడు (గురువుగా) దొరుకుతాడు. వారిపట్ల మీ "భావమెలా ఉంటే వారి నుండి అలాంటి ఫలితమే పొందుతారు" అని బాబా నోటినుండి వెలువడిన శృతివాక్యం. కీర్తనకారుని (దాసగణు)తో కలసి శిరిడి వచ్చిన నానాసాహెబ్‌ను, బండి సమయమైనా వారిని భోజనం చేసి వెళ్లమన్న బాబా మాటలోని ఆంతర్యాన్ని, అభయాన్ని గమనించిన చందోర్కర్ తాపీగా భోజనం సేవించి బయలు దేరుతాడు. కీర్తనకారుడు రైలు బయలుదేరే సమయానికి వెళ్లలేమన్న భావనతో భోజనం చేయకుండా వెళ్లిపోతాడు. రైలుబండి ఆలస్యమయి నానా వెళ్లిన తర్వాతనే బండి బయల్దేరటం చూస్తాం. ఏకకాలంలో ఒక భక్తుని **'విశ్వాసం'**ను మరొకనికి **'శిక్షణ'**గా మలచి ఇరువురికి అభయమనే **'రక్షణ కవచాన్ని'** అందించిన వైనం నేడు నా అనుభవంలో పునరావృతమైంది. (పాత్రలు, పాత్రధారులు). బొడ్డుపాడు సత్సంగ కేంద్రం నుండి 28 మందిమి "గురుపౌర్ణమి" సందర్భంగా శిరిడీ జూలై 20-7-02 న బయలు దేరి వెళ్ళాము. జూలై 23న గురువుగారి దర్శనం మొదటిసారి చేసుకొన్నాము. 28న గురువుగారి పాదదర్శనము చేసుకోవాలని అనుకొన్నాము.

జూలై 28న మాకు విజయవాడ వెళ్ళుటకు టిక్కెట్లు రిజర్వేషన్ చేయించుకొన్నాము. ట్రైన్ రాత్రి 8గం॥ లకు. మా సత్సంగ స్థాపన ప్రేరకులు అయిన శ్రీ సురేష్‌గారు మీకు గురువుగారి పాదదర్శనం తప్పక కలుగుతుంది, మీరు నమ్మకంతో ఉండమన్నారు. కాని సాయంత్రం 5గం॥ల నుండి అందరూ ఇక బయలుదేరకపోతే ట్రైన్ అందదు అని అనుకొంటున్నారు. అపుడు సురేష్‌గారు వచ్చి మీకు ఏం అనుమానం వద్దు, అవసరమైతే ట్రైన్ అరగంట లేటు అవుతుంది. కాని ట్రైన్ తప్పిపోవటం జరగదు అని, ఆయన అనుభవంలో కూడా ఇలానే జరిగిందని చెప్పారు. కాని మేము వినలేదు. అపుడు సురేష్‌గారు సరే వెళ్ళమన్నారు. మేము గురువుగారి పాదదర్శనం చేసుకోకుండా వెళ్ళిపోయాము. కొందరు గురుబంధువులు మాత్రం మేము రావలసిన ట్రైన్‌కే రావలసివున్నారు. కాని వారు టైమ్ గూర్చి ఆలోచించకుండా గురువుగారి పాదదర్శనం కోసం నమ్మకంతో వేచివున్నారు. నేను, నాతోపాటు మా పాప, బాబును కూడా తీసుకొని వెళ్ళాను. రైల్వేస్టేషన్‌కి వెళ్లిన తరువాత ట్రైన్ వచ్చింది. అందరం ట్రైన్ ఎక్కాం. ట్రైన్ కదిలింది. కాని నమ్మకంతో పాదదర్శనం కోసం వేచివున్న గురుబంధువులు రాకుండా ట్రైన్ గమ్యం చేరదుకదా! ఇంతలో నేను నా సీటు దగ్గరకు వెళ్లగానే మా బాబు కనిపించలేదు. కాని ప్రక్క పెట్టెలో ఎక్కాడు. తర్వాత మాదగ్గరకు వచ్చాడు. ఇంతలో మా 28 మందిలో ఒకరు మాబాబు కనపడటం లేదని తెలిసి వెంటనే చైన్ లాగి ట్రైన్ ఆపారు. దీనివలన ట్రైన్ తిరిగి బయలుదేరుటకు అరగంట లేటయ్యింది. నమ్మకంతో వున్న గురుబంధువులకు ట్రైన్ అందింది. చైన్ లాగకపోతేవారికి ట్రైన్ అందేదికాదు. ఈ సంఘటన వలన పాదదర్శనం చేసుకొన్న గురుబంధువులకు, పాదదర్శనం చేసుకోకుండా వచ్చిన మాకు కూడా గురువుగారి అనుగ్రహాలంబన మాకు తోడుగా నిలిచిందనే నిదర్శనాన్ని చూపారు. గురువుగారి దర్శన, పాదదర్శన ఆశీస్సులు పదేపదే పొందాలని ఆశిస్తూ...

గురుబంధువు,
సుభాషిణి





# అజ్ఞాతంగా కూడా అనుగ్రహమే

నేను గత 5 సంవత్సరముల నుండి గురుదేవులు శరత్‌బాబూజీని భగవత్ స్వరూపునిగా నమ్మి పూజించుచున్నాను. అనేక సందర్భములలో వారి ఆశీస్సులవలన నా సమస్యలు పరిష్కరింపబడినవి. డిశంబరు నెలలో ఆరోగ్యం సరిగాలేక రెండు కాళ్లకు నీరువచ్చినది. స్థానిక డాక్టర్ల సలహాపై 21-1-02 తేదిన ఒంగోలు వరప్రసాదరావుగారి హాస్పటల్‌లో 10 రోజులు ఉన్నాను.

గుండె స్కానింగ్‌తో సహా అన్నిపరీక్షలు చేసి పూర్తి విశ్రాంతి (అబ్‌సల్యూట్ బెడ్‌రెస్ట్) అని చెప్పినారు. నా భార్య సుజాత నన్ను పురిటి బిడ్డవలె చూస్తుంది. వారి సలహాపై అపోలో హాస్పటల్‌కు వెళ్ళుటకు నిశ్చయించుకున్నాను. ముందు రోజు ఒక అజ్ఞాత వ్యక్తి స్వస్తిక్ కర్పూరం బిళ్ల సైజులో 2 మాత్రలు ఇచ్చి, రెండు పూటల మ్రింగమని చెప్పిరి. మందులు చూస్తే అజ్ఞాత వ్యక్తి ఇచ్చిన మాత్రలు. అనుమానం వచ్చి మరల డాక్టరుగారిని అడిగితే, పూటకు 2 మాత్రలు మ్రింగవలెనని చెప్పిరి. 100% అజ్ఞాత వ్యక్తి గురుదేవులు శరత్‌బాబూజీయే. (ఈ లీలను సత్సంగములలో కూడా తెలియజేసాను). 21-11-02 మరల అన్ని పరీక్షలు చేసి, స్కూటర్ మీదనైన కాలేజికి వెళ్ళవచ్చు అని డాక్టరు సలహా ఇచ్చారు.

జి. సుబ్రహ్మణ్యం
సీనియర్ గ్రేడ్ లెక్చరర్, కందుకూరు.

# సమస్యల కొలువుకు పరిష్కారాల నెలవు 'సత్సంగం'

నా పేరు సుశీల. మాది తోట్లవల్లూరు మండలంలోని బొడ్డపాడు గ్రామం. మా ఇంటి ప్రక్కన జరిగే సత్సంగానికి నేను క్రమం తప్పకుండా వెళ్తున్నాను. మా పొలం వర్షాలు లేక, కాలవలు రాక తడవలేదు. నేను బాబా, గురువుగారి వద్దకు వచ్చి నా మనసులోని బాధను చెప్పకొన్నాను. రెండు రోజులకు పొలము తడిసినది. బాగు చేయించుకొని నాట్లు వేసుకొన్నాము.

మా అబ్బాయి అనుకోకుండా ఒక క్రిమినల్ కేసులో ఇరుక్కున్నాడు. ఆ కేసు ఎప్పటినుంచో వాయిదా పడుచున్నది. నేను సత్సంగంకు నియమంగా వెళ్లడం మొదలెట్టిన రోజున ఆ కేసు కొట్టి వేసారు. మా మరిదిగారి పాపకు ఆరోగ్యం బాగుండటం లేదు. నేను బాబా, గురువుగారి వద్దకు తీసుకు వచ్చినాను. అప్పటినుండి ఆ పాప సత్సంగంకు భక్తితో హాజరవుతుంది. సత్సంగంకు వచ్చిన దగ్గర నుండి ఆ పాప ఆరోగ్యం బాగానే ఉంది. మా సమస్యలు తీర్చి, మా పాప ఆరోగ్యం కాపాడిన బాబా, గురువు గార్లకు మా వందనాలు.

గురుబంధువు
సుశీల





# "ఆచేయి ఎంత హాయి"

భాగము - 20

## "పైకి కన్పించు మిష
## తెలియాలి తత్త్వపోష"

నూలును మగ్గంపై వేసి పడుగు పేకల కలయికతో నేతనేసిన గాని వస్త్రం తయారవ్వదు. రోగ మొచ్చిన వాడు రోగ నివృత్తిచేయు ఔషధం యొక్క పేరును పదేపదే స్మరించినందువల్ల ప్రయోజనం శూన్యం. "ఔషధాన్ని" సేవించినగాని స్వస్థత పొందలేడు. ఆకలైనవాడు "అన్నాన్ని" పలుమార్లు జపించినందున లాభమేమిటి? ఆకలి తీరాలంటే భోజనం చేయాల్సిందే. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా "జి.వో" లను తయారు చేసినంత మాత్రాన ప్రయోజనమేమిటి? వాటిని "నిస్వార్థంగా" అమలు పర్చిననాడే ఆశించిన ఫలితముంటుంది.

> "ఆశయాలకు ఫైళ్లుచాలవు, ఆదర్శాలకు నోళ్ళు చాలవు
> పదపదమని పలుకులే గాని, కదలని అడుగులు దేనికని"

వాపోయాడు గజల్స్‌లో జ్ఞానపీఠ గ్రహీత.

పై భావాన్ని మన సత్సంగనిర్వాహకులు, సత్సంగాలు వినేవారు అన్వయించుకొని సింహావలోకనం చేస్తే ఎలా ఉంటుంది! సాయి చరితలను చదువుతున్నాం. అవకాశం కల్గిన మేరకు మన పాండిత్యాన్ని, వాక్చాతుర్యాన్ని, ఎదుటివారికి అర్థంకాని సంస్కృత శ్లోకాలను దండిగ, దండకంలా వల్లె వేస్తాం. స్వరమాధుర్యానికి, గంభీరమైన ఉపన్యాసానికి ఆకర్షితులై - ఆహా! ఓహో! భలె, భలే!. ఫలితం నెల్రోజుల తర్వాత స్పీకరుగార్కి చదివింపులు, సన్మానాలు. ఈ కారణంగా వారేం చెప్పినా - అది సిద్ధాంతమే, సత్యమే అనేంతగా అతిసామాన్యునిలో నాటుకుపోతుంది.

చిన్నప్పడు మా నాయనమ్మ అనేది "పురాణం చెప్పే శాస్త్రిగారు ఉల్లిపాయలు తినరాదని చెప్పి ఇంటి కొచ్చిన తరువాత భార్యమీద మండిపడ్డాట్ట - పప్పపులుసులో ఉల్లిపాయలు వేయనందుకు. భార్య అడిగిన మాటవిని, ఓసి పిచ్చిమెహమా! ఇతరులకు చెప్పేందుకే సూక్తులున్నాయి. ధర్మరాజేమన్నాడో తెలుసా! ఈ ప్రపంచంలో అతి సులభమైంది ఇతరులకు సలహాలివ్వడమేనని - పురాణ ప్రవచనం చేసాడు!! ఇదంతా ఎందుకంటే, బాబా సత్సంగాలు నిర్వహిస్తున్నప్పడుగాని, వింటున్నప్పడుగాని, బాబా సాంప్రదాయమేమిటో? బాబా భావమేమిటో? అందులోని మాధుర్యమేమిటో? దాగిఉన్న నిగూఢార్థమేమిటో ఎలా తెలుస్తుంది? ఆచరణలో చూపితేతప్ప. ఆచరణలేని సూక్తులను అతిగా వల్లించినందున ఉపయోగమేమిటి? ఉపన్యాసాలనిచ్చి సాధించిందేమిటి? వెనకటికొకాయన వేదాంతసారాన్ని వివరిస్తూ ఈ తనువు, ఈ ధనము - అంతా అశాశ్వతమే, వెంటరాదు. "ముక్తినిచ్చు పరమాత్మను వదలి ధనమునకై పాకులాడకే వెఱ్ఱి మనసా... అంటూ గీతాలు పాడి సభను రక్తి కట్టించి, చప్పట్లు చరిపించుకొని, బయటికి రాగానే వారికిచ్చే పారితోషికంలో పది రూపాయలు తగ్గించి ఇచ్చే సరికి వారు లంకాదహనంలోని ఆంజనేయస్వామివారిలా వీరంగం చేసారు, అంగ

లార్చారు, ఆవేదనపొందారు. చివరకా పది రూపాయలిచ్చిన తరువాత వారు ఉగ్రరూపం నుంచి శాంత చిత్తులైనారు. ఇలాగే ఉంటుంది - బాబా సంప్రదాయం తెలియకుండా సత్సంగాలు చేస్తుంటే. ఇంకా ఎలా ఉంటుందో ఊహిద్దాం. గాంధేయవాదినని - బ్రాందీషాపు ప్రారంభించినట్లు. పరనింద, ఆత్మస్తుతి, ద్రవ్యాపేక్షలేని మహానుభావుణ్ణి - నాకు రూపాయి సంభావనా? ఏమీరాని ఆ వెధవకు రూపాయి సంభావానా? అంటె ఎలా ఉంటుందో గమనించండి. దేవుని దయవలన నాస్తిక మహా సభలు అద్భుతంగా జరిగినవంటే ఎలా ఉంటుందో ఆలోచించండి.

తెలుసుకోవాల్సిందేమిటంటే! నేను బాబా భక్తుడనని చెప్పకొంటూ, బాబా వాదిని అని ప్రచారం చేసికొని గురువారాలు ఉపవాసముంటానంటె? ఎలా ఉంటుందో ప్రారంభంలోని మాటలను చదువుకోవాలి! ఉపవాసాన్ని బాబా ఎంతగా నిరసించారో ముందుగా తెలుసుకోవాలి. ఈ వేవీతలంచక "బాబా" ఉపన్యాసాలిచ్చి నేను భక్తుడనంటె ఎలా? బాబా ఎందుకు నిరసించారో తెలియాలంటె మనం మొదట ఉపవాసాలను వదిలి వేయాలి, బాబా పేరుతో చేసేవారికే సుమా!

బాబా "శ్యామా!" తో విష్ణుసహస్రనామం చదవమని చెప్పారని, ఇది ఎంతో మహత్తరమైందని, ఒకసారి బాబాకు గుండె నొప్పివచ్చినప్పడు విష్ణుసహస్రనామాన్ని హృదయముపై ఉంచుకొనినానని నొప్పి దూరమైందని, ఇత్యాది విషయాలను ఉటంకించి విష్ణుసహస్రనామాన్ని పారాయణలు చేయిస్తారు. బాబా మందిరాల్లో విష్ణుసహస్రనామాన్ని పారాయణచేయటములో వ్యతిరేక భావనేమీలేదు. అది చాలా గొప్ప గ్రంధమే కావచ్చు. ఏతావాతా చెప్పేదేమంటే బాబా పేరుతో, బాబా మందిరాలలో తండోపతండాలుగా పారాయణ చెయ్యడం, అసలు బాబా ఏవిధంగా పారాయణ చేయమన్నారో మరచి చేయడం, ఇదంతా "సాయిఊసే - సాయిధ్యాసే". లేదులేదిక వేరేబాట అని భావించే సాయిభక్తులకు ఇబ్బందిగానే ఉంటుంది.

**"అన్యదైవము తెలియదు నీదుపాదము విడువనను"** బాబా భక్తుల ఆలోచన ఇలా ఉంటుంది.

"రామదాసి"లో మార్పుతెచ్చేందుకై బాబా సంకల్పించుకొనిన ఒకానొక సన్నివేశము. సోనాముఖి ఆకుకై బాబా రామదాసిని పంపటము, విష్ణుసహస్రనామపుస్తకాన్ని శ్యామను తీసికొనమని ఒత్తిడి చేయటం వంటివి కేవలం "మిష"లు మాత్రమే. బాబా చెప్పిన మాటలను కొన్ని మనం బాహ్యార్థంతో భావిస్తే అంతరంగం అర్థం కాదు. ఇక్కడ సన్నివేశానికంటె ఫలితాంశమునకే ప్రాధాన్యమివ్వాలి. బాబాను మనసులోకి రప్పించుకొని ఆయనకు నమస్కరించి ఈలీలను చదవండి, లేదా శరద్బాబూజీగారి వంటి మహానీయులనైనా ఆశ్రయించండి, వారి దివ్యానుగ్రహం వలన కొన్నికొన్ని మనకు అవగత మవుతాయి.

ఎంతో కాలంగా బడికి వెళ్లిన పిల్లవానికి ఏ.బి.సి.డి.లు వ్రాయటం రాకపోతే తల్లిగాని, తండ్రిగాని పాఠశాలకు వెళ్లి నిర్వాహకులను మందలిస్తారు. ఇన్నిరోజులుగా మాపిల్లవాడు బడికి వస్తున్నా ఒక్క అక్షరం ముక్క రాలేదంటే మీరేం చేస్తున్నారో నాకు తెలియదని వాపోతారు. ఇక్కడ ఉపాధ్యాయునికి ఏ.బి.సి.డీ.లు రావని అర్థం కాదుకదా! ఉపాధ్యాయునిగా తన కర్తవ్యమును సరిగా చేయలేదని అర్థం. పురాణాల విషయంగా ఆలోచిద్దామా! ఆకలి బాధను తట్టుకొనలేక వ్యాసులవారు కాశీని శపించ



బోయినారు. ఆ సమయంలో కాశీవిశాలాక్షి వ్యాసునికి భోజన మందించి, తృప్తిగావించి ఎంతో చాకచక్యంగా మందలిస్తుంది. అందులో కొన్ని మాత్రమే - తపస్సుకు ప్రయోజనము కోపమా! కోపము వలన తపస్సుకు వన్నెవచ్చునా? నీవేనా పదునెనిమిది పురాణములు రచించినది! నీవేనా భారత భాగవతాది గ్రంధములను రచించినది! ఒక్క దినము తిండి దొరకనందుకు పుణ్య వారణాశిని శపించెదవా? అంటూ భయంకరంగానే మందలించింది. (చూడగలరు భీమఖండము, కాశీఖండము. సంస్కృతములో స్కాందపురాణంతర్గతమైనదానిని శ్రీనాథ మహాకవి తెలుగు భాషలోనికి అనువదించారు). పై భావన వలన తెలియవలసినది తపస్సు చేయువారికి కోపముండ రాదని తెలియజేయుటకై, కాశీవిశ్వనాథుడు విశాలాక్షితో - బాదరాయణుని చిత్తమును పరిశీలించ వలెను. వ్యాసులవారు కాశీనగరములో భిక్షకు బయలుదేరినపుడతనికి ఇంటింట భిక్షలేకుండా చేయవలెనని శంకరులవారు చెప్పారు.

ఆ ప్రభావంతో వ్యాసులవారికి ఏ ఇంటి ముందాగినా? భిక్ష లేదనే సమాధానము? తన శిష్యులు ఈ పరిస్థితినే ఎదుర్కొనినారు. భోజన సమయమతిక్రమించ బోవుచున్నది. వ్యాసుల వారిలో "నేను" ఎంతటి వాడనో, "అంతటి" వాడికి "ఇంతటి" అవమానమా? అను ఉద్రేకము పొడచూపినది. కోపమధికమైనది. ఆకలి బాధను భరించలేని స్థితి ఏర్పడినది. వెంటనే కమండల జలాన్ని అందుకొని "మూడు తరముల వరకు విద్యలేకుండా, మూడు తరముల వరకు ధనము లేకుండా, మూడుతరముల వరకు మోక్షము లేకుండా ఉందురుగాక కాశీలోని బ్రాహ్మణులు" అని శపింపబోయిన సందర్భములో పార్వతీదేవి - వృద్ధస్త్రీ, పండు ముత్తైదువలా ఆవిర్భవించి తాను, తన భర్త అతిధుల కొరకు వేచిఉన్నామని. మాయింటికి భోజనానికి రావలసినదని ఆహ్వానించింది. వ్యాసులవారిని, ఆయన శిష్య బృందమంతటిని తీసికొని వెళ్లి  వారికి సంతృప్తిగా భోజనము పెట్టిరి. మూడు తరములంటె అప్పటి ఆయు ప్రమాణము ననుసరించి కనీసము 180 సం॥ అని అను కోవచ్చు. అన్ని వత్సరాల వరకు కాశీనగర వాసులైన బ్రాహ్మణులు విద్య, మోక్షము, సంపద, లేకుండా హీనాతి హీనమైన స్థితి, దుస్థితి, కలగాలని శపింపబోయినారు - భోజనము దొరకనందుకు. కోపమును జయించుట కొరకై మహర్షులు, యోగులు, మునులు, మౌనులు ఎటువంటి ప్రయత్నాలు సాగిస్తారో ఆ సందర్భములో తెలియ జేయబడింది.

కుడిచి కూర్చొన్న మీదట తమతో కొన్ని మాటలాడవలసి ఉన్నదని పార్వతీదేవి వ్యాసులవారిని ఆహ్వానించెను. పైన వివరించిన మందలింపు వాక్యములేగాక! కాశీని శపించబోవువాడు రుద్ర పిశాచియై జన్మించునను విషయము తెలియదా? సంయమీంద్రుడవే సంయమనము లేక ఈశ్వరుని నగరాన్ని శపింపబోయిన, ఆయనూరకుండునా? ఇంకా "ఇంకా" అనేక విధాలుగా పార్వతీదేవి మందలించిన విధానమును గమనించిన వారికి - వ్యాసుడంతటి మహనీయునికి కోపము ఉండరాదనే తెలుస్తుంది.

బాబా చేసి చూపిన లీలలోను మనం ఆంతర్యాన్ని, ఫలితాంశమును ప్రధానముగా గుర్తించాలి.

రామదాసి - సన్యాసి, విష్ణుసహస్రనామాన్ని కొన్ని సంవత్సరాలుగా పారాయణం చేస్తున్నాడు. పుస్తకం

లేకపోయినా అది అతని నోటికి కంఠోపాఠంగా వచ్చు. నిరంతర నామజపము వలనగాని, ఎడతెగని సాధన చేయుటవలనగాని, వ్యవధానములేని పారాయణవలన గాని, మలినమైన వాసనలు దూరంకావాలి. అలా అవి దూరం కాలేదంటె సాధనలో లోపమున్నదని మనం గుర్తించలేనినాడు, గురువు గుర్తించి ఆ లోపాన్ని సరిచేస్తారు. "రామదాసి" విషయంలో **బాబా** ఆ పనే చేసారు.

పనిపిల్ల ఇంటిని శుభ్ర పరచలేదని తెలిసినప్పడు, యజమానురాలు జోక్యం చేసుకొని ఎలా శుభ్ర పర్చాలో తెలియజేస్తుంది.

ఈ సందర్భంలో మనం గమనించాల్సినవి.

1. సోనాముఖి ఆకుకై బాబా రామదాసిని పంపుట మిష.
2. శ్యామాతో నేను ఒకప్పడు హృదయవేదనతో బాధ పడినప్పడు విష్ణుసహస్రనామ పుస్తకాన్ని గుండెలపై పెట్టుకొనినానని చెప్పటమూ మిషే.
   (చదువుకొను పిల్లలు వక్కపొడి తింటె, ఆ తల్లిదండ్రులు చదువురాదని మందలిస్తారు. వక్కపొడికి చదువుకు సంబంధం లేదు. ఆరోగ్య రీత్యా సంబంధముంది. కాని ఆ వయసు పిల్లవానికి "చదువనే" మాట మీదనే మార్పుతేవాలి. ఆరోగ్యాన్ని కాపాడాలి. ఇంకా.. ఇంకా.. ఇతర కారణాలుంటాయి. ఇక్కడ చదువు ఒక మిష).
3. విష్ణుసహస్రనామాన్ని గూర్చి గొప్పగా చెబితేనైనా శ్యామా తీసికొంటే, ఆవంకతో బాబా నడిపించదల్చుకొన్నకథకు అంకురార్పణ జరగదు. శ్యామాకు పుస్తక మివ్వటమనేది మిష. ఆ తరువాత జరగబోయేది బాబా ఆశించినది.

మన సాటి గురుబంధువుకు పుస్తకాన్నిచ్చినందుకు నీ కింతకోపమెందుకు. శ్యామ మనవాడు. నీకా పుస్తకంతో పనిలేదు. నీకు కంఠస్తము. అలాంటప్పడు నీకు ఆపుస్తకం లేకపోతే జరిగేనష్టమేమిటి? అనే మందలింపు వుంది. బాబా మాటల్లోని బాహ్యార్థాన్ని తీసికొని, బాబా శ్యామాకు స్వయంగా చెప్పారని, బాబా విష్ణుసహస్రనామానికి ఎంతో ప్రాధాన్యమిచ్చారని, కొందరు వారికిగల విష్ణు సహస్రనామాలపైని మోజు తీర్చుకొనేందుకు ఎన్నో ఎన్నో ఉపపత్తులు చూపుతారు. విష్ణు సహస్రనామాన్ని చదవడం మీద వ్యతిరేకత ఎవ్వరికీ ఉండదు. **"బాబా వంకతో", "బాబా చెప్పారని" బాబా ''చదవమన్నారని'' ''బాబాకు ఇదంటె ఎంతో ఇష్టమని''** ఇలాంటి మాటలు చెప్పితేనే **"బాబా"**నులోతుగా అర్థంచేసుకున్న వారికి నచ్చదు. ఉపవాసాలుండవచ్చు - కాని బాబా పేరుతో గురువారాలుంటూ, బాబాకు ఇష్టమైన గురువారం అంటే ........... నిజమైన బాబా భక్తుడు నవ్వుకుంటాడు. బాబాను అర్థంచేసుకున్నవాడు వక్రంగా ఓ ఓరచూపు చూస్తాడు. చివరిగా "ఈ సద్బ్రాహ్మణుడు లక్షలాది మందిని శుభ్రమార్గాన చివరికంటా గమ్యం చేరుస్తాడు" అన్నారు బాబా. అంటే బాబా తను బ్రాహ్మణుడని చెప్పినట్లా? కాబట్టి మాటల్లోని బాహ్యార్థాలకన్నా! నిగూఢమైన అంతరార్థం తెలియాలంటే - **"బాబానే పరదైవంగా భావించే వారికి అర్థమైనంత చక్కగా ఇతరారాధనలున్న వారికి అర్థం కాదేమో!"** చూద్దాం.

సమర్పణ - యస్. సాయివరప్రసాదరావు, లీడరు, రేపల్లె





# "మహనీయులలోని ఉదారగుణం - మనిషిని సంస్కరించు దివ్యతేజం"

సమర్పణ - గురుచరణదాసుడు

"సాయిబాబా" అనే పేరుతో ఆధ్యాత్మిక మాసపత్రిక ఒంగోలు ప్రాంతంనుండి వచ్చేది. ఆ పత్రికకు గురువుగారు చాలా కాలము సంపాదకులుగా వ్యవహరించారు. 1980 ప్రాంతములో గురువుగారు బాబా మీద చక్కని వ్యాసము వ్రాసినారు. 1996 ప్రాంతములో ఓ రోజున గురువుగారి సమక్షములో గడిపే మహద్భాగ్యం లభించింది. అంతకుమునుపు కాకినాడ నుండి బాబా పరంగా పత్రికొకటి వస్తుండేది. అందులోని వ్యాసమును చదివిన తరువాత నా బుద్ధి ఊరికే ఉండలేదు. అలా, అలా... వెనక్కు వెళ్లి 1980 సం॥ సాయిబాబా పత్రిక మీద ఆగిపోయింది. పదహారు సంవత్సరాల తరువాత అదే వ్యాసాన్ని అక్షరం మార్చకుండా 1996లో కాకినాడ వారు వేసినారు. నాకు ఆశ్చర్యము - కోపము - ఏకకాలములో కల్గినవి వ్యాసచౌర్యము జరిగినందుకు. చదువు కొనుచున్న రోజులలో **"కుకవి"** నిందను గూర్చి తెలిసి కొనినాను. ఒకరు వ్రాసినది మరి యొకరు ఎలాచౌర్యం చేస్తారులే అని అనుకొని సామాన్యంగా తీసికొనినాను.

సాహిత్య వ్యాసజగతిలో మనకు ఎదుటివారు చెప్పిన భావాలు నచ్చితే దానిని యధాతథంగా కొటేషన్స్‌లో చూపించి రచయిత పేరును చెప్పవచ్చు, లేదా ఫలానా "సాయిబాబా" పత్రికనుండి, అని వ్రాయవచ్చు, లేదా రచయిత / పత్రిక పేరును సూచించి వారి సౌజన్యముతో అని అనవచ్చు. దానివలన వ్యాసరచయితపై పాఠకునికి మరింత గౌరవమన్నది పెరుగుతుంది.

కానీ వారు అలాచేయకుండా, భాష, భావం వారి సొంతగొంతులో నుండి వచ్చిన దానిలా ప్రకటించినారు. ఆ రాత్రి గురువుగారితో ముచ్చటించే సమయంలో "సార్ ఇది ఒక సారి చూడండని వ్యాసమును చూపాను. నా తలంపేమంటే ఇది నేను వ్రాసింది కదా! అని గురువుగారంటారను కొనినాను. కాని గురువుగారు అలా అనలేదు. బాగుందని అన్నారు. మళ్లీ మరోసారి విస్తు పోయాను. నేనేమైనా! పొరపాటు పడ్డానా! అనుకొని, క్షణం ఆగి మళ్ళీ ఈ వ్యాసం మీరు వ్రాసిందని ........... సన్నగా నసిగాను. విని విననట్లూరుకున్నారు. మన "సాయిబాబా" పత్రికలో చదివినట్లు గుర్తు.... అని .... సన్నని స్వరంతో అన్నాను.

వదిలేట్టుగా లేడనుకున్నారో, ఏమో! అంగీకారసూచంగా నావైపు చూసి.... అయితే ఏమైందండి... ఈ మాటనేసరికి నాకు ధైర్యం పెల్లుబికింది...

ఇలా చెయ్యోచ్చా! ఇదెంత తప్పు... అంటూ నాధోరణిలో, నాబాణిలో మాట్లాడాను.

మౌనంగా విని.... అయితే ఇప్పుడేంచేస్తావన్నారు. ఇంకేముంది నాభావాల రసవాహిని పెల్లుబికి.... అతనికి నోటీసు ఇస్తానన్నా...., ఎందుకు? అన్నారు గురువుగారు.

మీ వ్యాసాన్ని తన వ్యాసంగా వేసుకున్నందుకు.

దానివల్ల నాకు కోపముంటే రావాలి! నీకెందుకు కోపం... అని గురువుగారు అన్నప్పుడు



మీ వ్యాసాన్ని... మరొకరు కాపీ చేస్తే ఎలా ఊరుకుంటాం...

నా వ్యాసాన్ని... మరొకరు కాపీ చేస్తే నాకురావాల్సిన కోపం... నీ కెందుకొస్తుందని అడుగుతున్నా! నీకు ఇతరులతో వాదులాడడం ఇష్టం... నీపాండిత్యాన్ని వారి ముందు ప్రదర్శించాలనుకుంటావు. ఇది వాదులాటకాదు. అలాగే అనుకుందాం.... నీ వెందుకు నోటీసు ఇవ్వాలి! నీ రచన కాదుగా అది, అని అన్నారు గురువుగారు.

దారి తోచక... అయితే మీకేమాత్రం కోపంగాని లేవా! అని అంటే

ఎంత మాత్రం లేదు. నాకు చాలా సంతోషంగా ఉందన్నారు గురువుగారు, అదెలాగా!

పదహారు సంవత్సరాల తరువాత అడుక్కుపోయిన ఆ వ్యాసాన్ని మరొకరు వెలికి తీసి వేసారంటే ఆ తరువాతివారు చదువుకొనే అవకాశమిచ్చినట్లేగా, మళ్లీ కొంతమందికి బాబాను గూర్చి తెలుసుకొనేందుకు, విషయాదులను అర్థం చేసుకోవటానికి పరోక్షంగా వారు సహకరించినట్లేగా. **"బాబా సేవ"**ను ఎవరైనా చేసుకోవచ్చు. నాకు కావాల్సింది **బాబా. బాబా నామం. బాబా చరిత్ర. బాబా పారాయణం.** మీరు కాపీ కొట్టారని అంటున్నారు, కాని వాస్తవానికి నాకా భావనేలేదు. యధాతథంగా ఉన్నది ఉన్నట్లుగా వ్రాసారంటే, ఆ వ్యాసాన్ని ఏమాత్రం కూడా మార్చకుండా అచ్చువేసారంటే వారికి బాబా పరంగా ఆ వ్యాసం నచ్చి, దాన్ని ఉన్నదిఉన్నట్లుగా వేస్తేనే బాగుంటుందని భావించేగదా! వారాపని చేసింది. మరుగునపడిన మంచి విషయాలను వెలికి తీసే ప్రయత్నమేగదా పత్రికలు చేయవలసింది. ఆ పనే వారు చేసారు. మీరు వారికి ఎలాంటి నోటీసులుగాని, ఉత్తరాలుగాని వ్రాయకండి. ఈ విషయాన్ని వదిలేయండి. **బాబాకు ఏది ఇష్టమో అది జరుగుతుంది.**

ఏం మాట్లాడాలో తెలియలేదు. మౌనం శ్రేయస్కరం గదా!

**"మహనీయునిలోని ఉదారగుణం, క్షమాగుణం కుసంస్కారిని తప్పకుండా సంస్కరించి, సాధుమార్గాన నడిపించి సజ్జనునిగా తీర్చిదిద్దుతుందను" సాధువాక్యము సత్యమని తోచింది.**

మనసులో గురుదేవా!

**శత్రువైనా, మిత్రుడైనా ఒకటే మీదీవెన. ఎవరి మీదనైనా తమకు ఒకే ఆలాపన.**

**మీ కీర్తి తరలిపోతున్నా మీకు ఉండదుబాధ**

**మీ సన్నిధిన అందరు ఉద్ధరించబడాలన్నదే మీ వ్యధ**

గురుబంధువులు తమ అనుభవాల్ని Internet ద్వారా పంపడానికి **leelas@guruji.org** కి mail చేయగలరు. ఇలా వచ్చిన అనుభవాలలో ఒకటైన **"అనుక్షణం - అనుగ్రహం"** ను ఈ సంచికలో వీక్షించగలరు.

అపారమైన గురుకృపను పంచుకోవడానికి రాష్ట్ర, దేశ నలుమూలలనుండే కాక విదేశాలనుండి కూడా గురుబంధువుల అనుభవాలు "గురుకృప" పత్రికకు చేరడం ముదావహం. స్థలాభావం వల్ల కొందరు గురుబంధువుల అనుభవాల్ని ప్రచురించలేక పోవడానికి కారణం - అన్ని ప్రాంతాలను పరిగణనలోనికి తీసుకోవడంవల్ల కొంత ఆలస్యమైనా, అలసత్వానికి చోటుఇవ్వకుండా గురుఅనుభవామృతములోని ప్రతి బొట్టును మనమందరం తప్పకుండా పంచుకుందామన్న తలంపే.